క్లుప్తంగా

అయ్యప్ప ఆలయంలో దివ్య పడిపూజ



నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా ఆధ్వర్యంలో అర్చకుడు దేవేశ్ మిశ్రా దివ్య పడిపూజ, పుష్పాభిషేకం చేశారు. దివ్య పడిపూజ, అభిషేక దాతలు యశ్వంత్, మల్యాల రాజులత, మల్యాల ప్రవీణ్ సాగరిక, బజ్జూరి మంజుల శ్రీనివాస్, తనూషా, ప్రియతమ్, సాన్విత అయ్యప్పస్వామికి అభిషేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు పైస సురేశ్, చింతల కమలాకర్‌రెడ్డి, దొడ్డ రవీందర్, మాదారపు చంద్రశేఖరం, శ్రీరాం ఈశ్వరయ్య, అనంతుల రాంనారాయణ, పాలకుర్తి శ్రీనివాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పంబారట్టు



పర్వతగిరి : అయ్యప్ప స్వాములు మండల కేంద్రంలోని గురువారం పంబారట్టు కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. అయ్యప్పస్వామి విగ్రహాన్ని వేణుగోపాలస్వామి ఆలయం నుంచి శివాలయం, ఆంజనేయస్వామి ఆలయం మీదుగా మాడవీధుల్లో ఊరేగిస్తూ పెద్దచెరువు రిజర్వాయర్ వరకు తీసుకెళ్లి జలాభిషేకం, పుష్పాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. తొలుత పెద్దమ్మతల్లి ఆలయంలో కుంకుమాభిషేకం, పాలాభిషేకం, నెయ్యాభిషేకం నిర్వహించారు. తదనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు ఫణిశర్మ, రాములు, మల్లికార్జున్, రాజు, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



నర్సంపేట : అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గిరగాని సుదర్శన్, బెజ్జంకి ప్రభాకర్, కోట డేవిడ్, మైస వసంత, ఎర్రబోయిన రాజశేఖర్, కాసుల రవికుమార్‌లను మదర్స్ ల్యాండ్ హైస్కూల్ చైర్మన్ పాశికంటి రమేశ్ పట్టణంలో గురువారం శాలువాలతో సన్మానించారు. అనంతరం రమేశ్ మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థల నిర్వాహకుల సేవలు అభినందనీయమని చెప్పారు.

డాక్టరేట్ గ్రహీతకు..

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారులోని బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్) కళాశాల ఈసీఈ విభాగ అధ్యాపకుడు వేగండ్ల కార్తీక్‌కుమార్ నూరుల్ ఇస్లామ్ సెంటర్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ నుంచి డాక్టరేట్ అందుకోగా ఆయన్ను బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, సెక్రటరీ రాజేశ్వర్‌రెడ్డి గురువారం శాలువాతో సన్మానించారు. అనంతరం ప్రిన్సిపాల్ హరిహరన్ మాట్లాడారు. కార్తీక్‌కుమార్ తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారిలోని నూరుల్ ఇస్లామ్ సెంటర్ ఫర్ హైయర్ ఎడ్యుకేషన్‌లో క్వాలిటేటివ్ అనాలసిస్ ఫర్ ఎఫ్‌బీఎంసీ బేస్డ్ మాడ్యులేషన్ స్కీమ్స్ ఇన్ అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్స్ సిస్టమ్ అనే అంశంపై గైడ్ అధ్యాపకుడు డాక్టర్ బేనిత ఆధ్వర్యంలో పరిశోధన గ్రంథం సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ నారాయణ, ఏఓ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

అభినందన

సంగెం : మండలంలోని మొండ్రాయికి చెందిన ఆకుల రాణి–శ్రీనివాస్ దంపతుల కుమార్తె హాసిని గ్రూప్–4 పరీక్షలో ప్రతిభ చాటి రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించగా ఆమెను కుటుంబీకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు గురువారం అభినందించారు. హాసిని 2019 ఏప్రిల్ నుంచి 2021 ఆగస్టు వరకు దుగ్గొండి మండలంలోని బొబ్బరోనిపల్లి జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా పని చేసింది. అనంతరం ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి గ్రూప్–4 పరీక్షకు సిద్ధం అయ్యింది. ఈనెల 4న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆమె నియామక పత్రం అందుకుని ఆర్డర్ కాపీని డీఆర్‌ఓకు గురువారం అందజేసింది.

దరఖాస్తుల ఆహ్వానం

నల్లబెల్లి : మండల కేంద్రంలోని కేజీబీవీలో 2024–25 విద్యాసంవత్సరంలో నర్సింగ్, తెలుగు సబ్జెక్టులు బోధించేందుకు తాత్కాలిక ప్రాతిపాదికన గెస్ట్ లెక్చరర్‌గా పని చేయడానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధికారి ఆవుల సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సింగ్ పోస్టుకు బీఎస్సీ నర్సింగ్, తెలుగు బోధించడానికి ఎంఏ తెలుగుతోపాటు బీఈడీ అర్హత కలిగిన మహిళలు ఈనెల 10వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. నెలసరి వేతనం రూ.23 వేలు ఉంటుందని వివరించారు.

శాఖ గ్రంథాలయం శిథిలం

- భవన నిర్మాణంపై నిర్లక్ష్యం
- అద్దె గదిలో నిర్వహణ



శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయ పాత భవనం

రాయపర్తి : సుమారు 6 వేల 95 నవలలు, అకాడమీ, రెఫరెన్స్ పుస్తకాలు కలిగిన 64 ఏళ్ల క్రితం నాటి చరిత్రాత్మక గ్రంథాలయ భవనం శిథిలమైంది. ప్రభుత్వ నిర్లక్ష్యం, నిరాదరణతో ప్రస్తుతం అద్దె గదిలో అరకొర వసతుల నడుమ కొనసాగుతోంది. ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయానికి నూతన భవనం మంజూరు చేసి పూర్వవైభవం తీసుకురావాలని ప్రజలు, పాఠకులు కోరుతున్నారు.

మండల కేంద్రంలో 1960లో శాఖ గ్రంథాలయం ఏర్పాటు చేశారు. దినపత్రికలు, నవలలు, వివిధ గ్రంథాలు, పుస్తకాలు చదివేందుకు పాఠకులు రావడం పరిపాటి. భవనంలోని ఒక గదిని పుస్తకాలను భద్రపర్చేందుకు, మరో గదిని పాఠశాల కోసం ఏర్పాటు చేశారు. ఫర్నీచర్ సైతం పాఠకుల కోసం సమకూర్చారు. తెలుగులో 6 వేల 95 నవలలు, అకాడమీ, రెఫరెన్స్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఆంగ్ల భాషకు చెందిన 1270, హిందీకి సంబంధించి 817, ఉర్దూ భాషలో వెయ్యి 13, ఇతర పుస్తకాలు 723తోపాటు పోటీ పరీక్షల పుస్తకాలు కోకొల్లలుగా ఉన్నాయి. గ్రంథాలయంలో 449 మందికి సభ్యత్వం ఉంది. సుమారు 50 ఏళ్లపాటు పాఠకులకు విజ్ఞానాన్ని ఘనంగా అందించిన గ్రంథాలయం తదనంతరం శిథిలమవుతూ వచ్చింది. గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో పైకప్పు పెంకులు ఊడుతున్నాయి. ప్రస్తుతం పూర్తిగా శిథిలమై కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. ఫర్నీచర్ సైతం తుప్పు పట్టింది. ఈ క్రమంలో గ్రంథాలయాన్ని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇరుకైన అద్దె గదిలో ఏర్పాటు చేశారు.



అద్దె భవనంలోని గ్రంథాలయం

పాతపుస్తకాలతోనే సరి....

పాతపుస్తకాలనే పాఠకులు సరిపెట్టుకుంటున్న దుస్థితి నెలకొంది. ప్రభుత్వం కొన్నేళ్లుగా కొత్త పుస్తకాలు అందించడం లేదు. ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ ఒక్కరే విధులు నిర్వర్తిస్తున్నారు. వర్ధన్నపేట లైబ్రేరియన్‌నే స్థానిక శాఖ గ్రంథాలయానికి ఇన్‌ఛార్జ్‌గా నియమించడంతో ఆయన ఇక్కడ కేవలం మూడ్రోజులు మాత్రమే గ్రంథాలయం తెరుస్తున్నారు.

నూతన భవనం నిర్మించాలి



సుమారు 60 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన శాఖ గ్రంథాలయం కావడంతో భవనం శిథిలావస్థకు చేరుకుంది. ప్రతిరోజూ 50 నుంచి 80 మంది వరకు గ్రంథాలయానికి వస్తారు. నూతన భవనం నిర్మించాలి.

-ఎనగందుల శ్యాంసుందర్, పాఠకుడు

ప్రభుత్వం స్పందించాలి



ప్రస్తుతం అద్దె గదిలోనే గ్రంథాలయం కొనసాగుతోంది. భవనం నిర్మించాల్సి ఉంది. పాఠకులు కొత్త పుస్తకాలు అడుగుతున్నారు. భవనం, తదితరాలపై ప్రభుత్వం స్పందించాలి.

- అమీనానాయక్, ఇన్‌చార్జ్ లైబ్రేరియన్

దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యం

- సెక్టోరియల్ అధికారి, ఐఈసీఎంఓ సుభాశ్

వర్ధన్నపేట : దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా సెక్టోరియల్ అధికారి, ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ (ఐఈసీఎంఓ) కుడికాల సుభాశ్ తెలిపారు. పట్టణంలోని భవిత సెంటర్‌లో దివ్యాంగుల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. దివ్యాంగులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం సుభాశ్ మాట్లాడారు. సర్వశిక్షా అభియాన్ ద్వారా దివ్యాంగులకు కల్పిస్తున్న సదుపాయాలు, ప్రోత్సాహకాలు, పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఆర్‌పీ రేణుకాదేవి, వాణి, భాస్కర్, సీఆర్‌పీ రమాదేవి, ఉపాధ్యాయులు ప్రసూన, సంధ్యారాణి, వెన్నెల, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట : మాట్లాడుతున్న సుభాశ్

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని ఎంఆర్‌సీలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి, ఐఈసీఎంఓ కుడికాల సుభాశ్ మాట్లాడారు. ప్రభుత్వం విద్యా శాఖ ద్వారా అందిస్తున్న కృత్రిమ పరికరాలు, ఫిజియోథెరఫీ, స్పీచ్ థెరఫీ, అలవెన్స్, తదితరాలను దివ్యాంగులు వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ నల్లా శ్రీవాణి, ఎంఈఓ బైరి సరళ, చెన్నారావుపేట స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం పాపమ్మ, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ రాజేశ్, ఐఈఆర్‌పీ రాము, ఎంఆర్‌సి సిబ్బంది అశోక్, స్వప్న, సీఆర్‌పీ సంపత్, బాలు, శిల్ప, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



ప్రభుత్వ గోడలపై ప్రైవేట్ ప్రచారం

ప్రభుత్వ గోడలపై ప్రైవేట్ వ్యక్తులు యథేచ్ఛగా వ్యాపార ప్రకటనలు రాయిస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తుల ఇళ్ల గోడలయితే యజమానుల అనుమతి, ప్రభుత్వ భవనాలపై రాయిస్తే సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి. కాగా మండలంలోని కాపుల కనిపర్తి ప్రభుత్వ హైస్కూల్ ప్రహరీపై ఓ ప్రైవేట్ ఆస్పత్రికి సంబంధించిన ప్రకటనతోపాటుగా లెట్రిన్ క్లీనింగ్ ప్రకటన రాయించారు. సదరు ప్రచారాన్ని తొలగింపజేయడంతోపాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- సంగెం**

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
జి.రాము, ఎంఈఓ
ఫోన్‌నంబర్ : 9949442726

‘యూత్’ మండల అధ్యక్షుడిగా రమేశ్



సంగెం : రమేశ్‌నాయక్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

సంగెం : యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా మండలంలోని ఎల్గూర్ స్టేషన్ పరిధిలోని రామచంద్రునాయక్ తండాకు చెందిన గుగులోతు రమేశ్‌నాయక్ ఎన్నికయ్యారు. ఎన్నికల్లో ఆరుగురు పోటీ పడగా రమేశ్ ఏకపక్షంగా గెలుపొందారు. ఈ సందర్భంగా ఆయన్ను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. మండలంలో పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత పటిష్టం చేసేలా యువజన విభాగాన్ని చైతన్యవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గుగులోత్ వీరమ్మ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజ్ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు కవిత, నాయకులు శ్రీకర్, రామకృష్ణ, సన్నీ, భరత్, చందు, అశోక్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



రాయపర్తి : కల్యాణ్‌తో ఝాన్సీరెడ్డి, తదితరులు

మండల అధ్యక్షుడిగా కల్యాణ్

రాయపర్తి : యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన బొమ్మెర కల్యాణ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఝాన్సీరెడ్డి మాట్లాడారు. మండలంలో యువజన విభాగాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. తదనంతరం కల్యాణ్ మాట్లాడారు. సేవాభావంతో పని చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, వర్ధన్నపేట మార్కెట్ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, సోమనాథ ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమాచార్యులు, నాయకులు మహేందర్ రెడ్డి, మాచర్ల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు నీటిని విడుదల చేయాలి

నల్లబెల్లి : ములుగు నుంచి పాకాలకు వెళ్లే దేవాదుల పైప్‌లైన్ ద్వారా మండలంలోని మేడపల్లి, మామిళ్ల చెరువులకు నీటిని విడుదల చేయాలని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రసిడెంట్ వైనాల అశోక్ ప్రభుత్వాన్ని కోరారు. ఆయన ఆధ్వర్యంలో దేవాదుల ప్రాజెక్టు డీఈఈ అప్పలనాయుడును కలిసి వినతిపత్రం అందజేసింది. అనంతరం అశోక్ మాట్లాడారు. చెరువుల ద్వారా రెండు పంటలకు సాగునీరు అందిస్తే నారక్కపేట, గుండ్లపాహాడ్, మేడపల్లి, గొల్లపల్లి రైతులకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అనిల్

పర్వతగిరి : యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన కందికట్ల అనిల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో విలేకరులతో గురువారం మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. తద్వారా పార్టీని, యువజన విభాగాన్ని బలోపేతం చేస్తామన్నారు.

8న రౌండ్ టేబుల్ సమావేశం

వర్ధన్నపేట : ఈనెల 8న దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ‘రాజ్యాంగ పితామహుడిని దేశ రాజధానిలో గౌరవించుట–రాజకీయ నాయకుల పాత్ర’ అంశంపై స్థానిక ప్రెస్ క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు మునిగాల అరుణ్‌కుమార్ తెలిపారు. ఆ కార్యక్రమ వాల్‌పోస్టర్లను పట్టణంలో ఆయన ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో రాజ్యాంగం కీలకం

- అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్

పర్వతగిరి : దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో రాజ్యాంగం కీలకపాత్ర పోషిస్తోందని అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు జిల్లా శ్రీనివాస్ తెలిపారు. ఆ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10వ తరగతులు చదువుతున్న విద్యార్థులకు ×భారత రాజ్యాంగం–దాని విశిష్టత –దేశ పరిరక్షణలో రాజ్యాంగం పాత్ర※ అంశంపై గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులు హాజరై ఉత్సాహంగా చిన భారత రాజ్యాంగంపై ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమని పర్వతగిరి అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు జిల్ల శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరికీ రాజ్యాంగంపై అవగాహన ఉండాలని ఆకాంక్షించారు. రాజ్యాంగం అన్ని వర్గాల ప్రజలకూ హక్కులు కల్పించిందని, వివక్షను రూపుమాపేలా అనేక అంశాలను పొందుపర్చిందని తెలిపారు. అనంతరం స్థానిక ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పాక రమేశ్ బాబు మాట్లాడారు. విద్యార్థి దశలోనే రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కొంకపాక స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ భిక్షపతి, నాయకులు జిల్లా ధర్మయ్య, బొట్ల భాస్కర్, ఉపాధ్యాయులు మడత భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తి సంబురాలు

దుగ్గొండి : మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి సంబరాలు గురువారం నిర్వహించారు. రంగవల్లుల పోటీలు నిర్వహించారు. అనంతరం ఏపీఎం గుజ్జుల రాజ్‌కుమార్ మాట్లాడారు. మండల ఉత్తమ గ్రామైఖ్య సంఘంగా ఎంపికయిన అడవిరంగాపురం బాలాజీ గ్రామైఖ్య సంఘం బాధ్యులను సన్మానించారు. రంగవల్లుల పోటీల్లో విజేతలుగా నిలిచిన గుడ్డెలుగులపల్లి గ్రామైఖ్య సంఘం సభ్యులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అన్నారపు లలిత, కార్యదర్శి బోడకుంట్ల రజిత, ఆడిటర్ సంపత్, కోశాధికారి సావిత్రి,తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

చెన్నారావుపేట : మండలంలోని ఖాదర్‌పేటకు చెందిన పులిచేరు రాజేందర్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గూడ మహేందర్ గురువారం రూ.8 వేల నగదు సాయం అందజేశారు.

పరామర్శ

రాయపర్తి : స్థానిక పీఏసీఎస్ చైర్మన్ కుందూరు రామచంద్రారెడ్డిని అతడి సతీమణి వెంకటమ్మ ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్ గురువారం పరామర్శించారు. తొలుత వెంకటమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఎన్‌సీసీ కేడెట్లకు ఫైరింగ్‌లో శిక్షణ

వర్ధన్నపేట : పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ ఎన్‌సీసీ కేడెట్లకు మామునూరు 4వ బెటాలియన్ ఆధ్వర్యంలో ఎయిర్ ఫీల్డ్‌లో గురువారం ఫైరింగ్‌లో శిక్షణ ఇచ్చారు. ఫైరింగ్‌లో ఎన్‌సీసీ వాయు విభాగం వారెంట్ ఆఫీసర్ శర్మ, ఫణి ఆధ్వర్యంలో ఫస్ట్ ఆఫీసర్ మనుజేందర్‌రెడ్డి, థర్డ్ ఆఫీసర్ చింతం నాగరాజు శిక్షణ ఇచ్చారు. ఫైరింగ్‌లో పాటించాల్సిన మెళకువలను వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రాయపర్తి : మండల కేంద్రంలోని హెచ్‌పీ పెట్రోల్ పంప్ వద్ద ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఒకదాన్ని మరొకటి ఢీకొనగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. ప్రమాదంలో మైలారం గ్రామానికి చెందిన భిక్షపతి, ఐనవోలు మండలంలోని గర్నెపల్లికి చెందిన గుండెబోయిన రాజేందర్ గాయాల పాలయ్యారు. స్థానికులు ఇద్దరినీ చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

ఫర్టిలైజర్ షాపులో విజిలెన్స్ దాడులు

- రూ. 4.95 లక్షల విలువైన పురుగు మందులు స్వాధీనం

నర్సంపేట రూరల్ : అక్రమంగా పురుగు, కలుపు మందులు నిల్వ చేశారనే సమాచారం మేరకు ఫర్టిలైజర్ షాపులో దాడులు నిర్వహించి రూ. 4.95లక్షల విలువైన స్టాక్‌ను సీజ్ చేసినట్లు విజిలెన్స్ సీఐ అనిల్ కుమార్, విజిలెన్స్ ఏఓ శ్రీనివాస్, నర్సంపేట ఏఓ కృష్ణకుమార్ తెలిపారు. వారి కథనం ప్రకారం.. నర్సంపేట పట్టణానికి చెందిన హరిట్రేడర్స్ ఆన్‌లైన్ ద్వారా ఫర్టిలైజర్స్ కొనుగోలు చేస్తున్నారని బేయర్ కంపెనీ ప్రతినిధులు విజిలెన్స్ అధికారులకు సమాచారం అందించడంతో గురువారం ఆ షాపును తనిఖీ చేశామన్నారు. ఈతనిఖీలో రూ. 4.95లక్షల పురుగు, కలుపు మందులు కొనుగోలు చేశారని, ఆస్టాక్‌ను వెంటనే సీజ్ చేశామన్నారు. ఆ షాంపిల్స్‌ను టెస్టుకు పంపించాక రిపోర్ట్ ఆధారంగా ఆ షాపుపై కేసులు నమోదుచేస్తామన్నారు. దాడుల్లో నర్సంపేట ఏఈఓ మెండు అశోక్, బెయర్ కంపెనీ ఆర్‌ఎం అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హరి ట్రేడర్స్‌లో సోదా చేస్తున్న అధికారులు

భూసార పరిరక్షణతో అధిక దిగుబడి

- కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సౌమ్య

రాయపర్తి : భూసార పరిరక్షణతోనే పంటల సాగులో అధిక దిగుబడి సాధించవచ్చని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సేద్య విభాగ శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య తెలిపారు. ప్రపంచ నేల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని జయరాం తండాలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేల పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. పచ్చిరొట్ట, పప్పు దినుసుల సాగులో నేలకు సేంద్రియ పదార్థాలను అందించడం కీలకమని చెప్పారు. నేలలో నీటిని నిల్వ చేసుకునే తత్వంపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు భూసార పరీక్ష పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సస్యరక్షణ విభాగ శాస్త్రవేత్త డాక్టర్ రాజు, కోరమాండల్ సంస్థ ప్రతినిధి శ్రీధర్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

భూసారాన్ని కాపాడుకోవాలి

గీసుకొండ : మండలంలోని రైతు వేదికల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఏఓ హరిప్రసాద్ బాబు మాట్లాడారు. భూసారాన్ని కాపాడుకుంటూ కోతకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



రాయపర్తి : మాట్లాడుతున్న డాక్టర్ సౌమ్య

నేల కోతకు గురి కాకుండా వాలు సేద్యం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓలు సంపత్, స్మిత, రజిని, అఖిల్, కావ్య, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యకాళ్లను కాల్చవద్దు

ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఏఓ బోగ శ్రీనివాస్ మాట్లాడారు. వరి, మక్కజొన్న, పత్తి కొయ్యకాళ్లను కాల్చవద్దని చెప్పారు. కొయ్యకాళ్లను కాల్చితే మిత్ర పురుగల సంఖ్య, సేంద్రియ కర్బనం తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. భూసారం క్షీణించిన దిగుబడి తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు నాగరాణి, ఆశాదీప్ తదితరులు పాల్గొన్నారు.

‘నగదు బదిలీ’లో ప్రభుత్వం విఫలం

- జీఎంపీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి అశోక్

నర్సంపేట : గొల్ల కురుమలకు గొర్రెల పంపిణీకి ప్రత్యామ్నాయంగా నగదు బదిలీ చేస్తామన్న ఎన్నికల హామీని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బొల్లం అశోక్ విమర్శించారు. పట్టణంలోని ప్రజాసంఘాల భవనంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నగరబోయిన సారంగం అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే గొల్ల కురుమలకు రూ.2 లక్షలు చొప్పున నగదు బదిలీ చేస్తామని హామీ ఇచ్చి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చి విస్మరించిందని విమర్శించారు. నగదు బదిలీ చేయాలని, అన్ని గ్రామాల్లో పశు వైద్యశాలలు నెలకొల్పాలని, మూగజీవాల మేత కోసం సొసైటీలకు పదెకరాలు చొప్పున భూమి కేటాయించాలని, ప్రమాదవశాత్తు మృతి చెందిన గొల్ల కురుమలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం ఈనెల 12న తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గొల్లకురుమలను కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు చల్ల మల్లయ్య, జిల్లా కార్యదర్శి పరికి మధుకర్, జిల్లా ఉపాధ్యక్షుడు మైల రాజు, జిల్లా కమిటీ సభ్యులు జక్క రవి, కంచ ఐలయ్య, సూరయ్య, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

‘బీఆర్‌ఎస్ నేతల అరెస్టు అప్రజాస్వామికం’



ధర్నా సందర్భంగా నినాదాలు చేస్తున్న సత్యనారాయణ, తదితరులు

నర్సంపేట : బీఆర్‌ఎస్ నేతలైన మాజీ మంత్రి హరీశ్ రావును, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి వెన్నెముద్దల శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద గురువారం ధర్నా, రాస్తారోకో నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, శ్రీధర్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేసిన నాయకులను అరెస్టు చేయిస్తోందని మండిపడ్డారు. అరెస్టు చేసిన నాయకులందరినీ బేషరతుగా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు, పట్టణ ప్రచార కార్యదర్శి మండల శ్రీనివాస్, నాయకులు సదానందం, వెంకటేశ్వర్లు, రావుల సతీశ్, కొడారి రవి, మోటూరి రవి, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

‘ఆటోల బంద్‌కు మద్దతు’

నర్సంపేట : ఈనెల 7న ఆటోల రాష్ట్ర వ్యాప్త బంద్‌కు బీఆర్‌టీయూ సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ మేరకు ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు గురువారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తదనంతరం విస్మరించిందని విమర్శించారు. మహాలక్ష్మి పథకంతో నష్టపోతున్న ఆటోడ్రైవర్లను ఆదుకుంటామన్న మాటను సైతం తుంగలో తొక్కారని ఆందోళన వెలిబుచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా చోటు చేసుకున్న 40 మంది ఆటోడ్రైవర్ల ఆత్మహత్యకు బాధ్యత వహిస్తూ బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

‘అభివృద్ధి శూన్యం’

రాయపర్తి : కాంగ్రెస్ పాలనలో పాలకుర్తి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యమని బీజేపీ మండల అధ్యక్షుడు నూనె అనిల్ అన్నారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోపై చార్జ్‌షీట్‌ను గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎనగందుల శ్రావణ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాపాక ప్రశాంత్, జిల్లా అధికార ప్రతినిధి పెండ్యాల గణేశ్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బూర్గు నవీన్, నాయకులు అబ్బోజు బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.